ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (మంగళ)
సహరి : 4:35 (బుధ)



• ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

మొగల్తూరు, ఏప్రిల్ 1 : ముత్యాలపల్లిలో సోమవారం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు రేవు రాము, సార్వ దుర్గాప్రసాద్, వాటాల కామాక్షి, కొల్లాటి మణికంఠ, విష్ణుకుమారి, లక్ష్మీకుమారి పాల్గొన్నారు. దీనిపై గ్రామ జనసేన నాయకులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

డ్వాక్రా రుణమాఫీ చేస్తారంటూ

» ఆధార్ కార్డుల సేకరణలో డ్వాక్రా సీఏలు

డ్వాక్రా రుణమాఫీ కోసం మహిళల నుంచి వివరాలతోపాటు ఆధార్ కార్డులను సీఏలు సేకరిస్తున్నారు. దీంతో మహిళలు కూడా వారికి సహకరించి వివరాలు చెప్పడంతోపాటు ఆధార్ జిరాక్స్ కాపీలను అందజేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలంలోని గ్రామాల్లో ఇది జోరుగా జరగడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఇలా చేయడంపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ కోసం అడుగుతున్నారు కాబట్టే ఇస్తున్నామని పలువురు మహిళలు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించాలి కాబట్టే ఆధార్ కార్డులు సేకరిస్తున్నామని డ్వాక్రా సీఏలు చెబుతున్నారు.

- అత్తిలి

పల్లెల్లో చిమ్మ చీకట్లు

» బిల్లులు చెల్లించక పంచాయతీల కరెంటు కట్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1 : బిల్లులు చెల్లించకపోవడంతో జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. తాజాగా తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల, మారంపల్లి, నందమూరు, పెంటపాడు మండలం బొడపాడు, అలంపురం, చింతపల్లి, కోరుమిల్లి, పడమరవిప్పర్రు, యానాలపల్లి, తదితర గ్రామాల్లో విద్యుత్ కట్ చేశారు. ఆయా గ్రామాల్లో వీధి లైట్‌లు వెలగకపోవడంతో చీకట్లలోనే ప్రజలు మగ్గిపోతున్నారు. 'నందమూరు గ్రామ పంచాయతీ నిర్వహణకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాం. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.లక్ష వచ్చాయి. వీటిలో సగం విద్యుత్ బిల్లులకు చెల్లించాలి. ఆరు నెలల నుంచి చేసిన పనులకు రూ.2 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే వేసవికి ప్రజల దాహార్తి తీర్చాలంటే నిధులు లేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కావడం లేదు' అని నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి వాపోయారు.

కూటమి గెలుపు అనివార్యం

» మాజీ ఎమ్మెల్యే మాధవతో లోకేశ్ స్పష్టీకరణ



భీమవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు సోమవారం భేటీ అయ్యారు. విజయవాడలో ఆయనను ముఖ్య అనుచరులతో కలిశారు. నరసాపురం రాజకీయ పరిస్థితులు, సమస్యలపై చర్చించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలుపు అనివార్యం. ఇందుకు నరసాపురంలో సహకారం అందించాలి. అక్కడ టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్ఠానం మరిన్ని చర్యలు తీసుకుంటుంది' అని లోకేశ్ సూచించారు. నరసాపురం నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై తాను చేసిన పోరాటాలను లోకేశ్ దృష్టికి మాధవ్ తీసుకువెళ్లారు. టీడీపీ అధినేత చంద్రబాబును లోకేశ్ సంప్రదించిన తర్వాత అధిష్ఠానం నుంచి మాధవకు మరోసారి పిలుపురానుంది.

5న చంద్రబాబు రాక

» తణుకు, పాలకొల్లులో ప్రజాగళం సభలు



భీమవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో భాగంగా ఈ నెల 5న తణుకు, పాలకొల్లులో పర్యటిస్తారు. కూటమి అభ్యర్థులు ఖరారైన తర్వాత ఆయన జిల్లాకు తొలిసారిగా వస్తున్నారు. అదే రోజు రాత్రి జిల్లాలో బస చేసి, మర్నాడు ముఖ్య నేతలు, అభ్యర్థులతో సమీక్షిస్తారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు.

• మహిళా చైతన్యం



ఇంటింటి ప్రచారంలో భాగంగా తణుకు సజ్జాపురంలో మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ఇస్త్రీ చేస్తూ ఇలా..

• హారతులు పడతాం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మకు ఆకివీడు మండలం మాదివాడలో హారతులు పడుతున్న మహిళలు

• పింఛన్ పెంచుతాం



బాబు సీఎం కాగానే పింఛన్ రూ.4 వేలు చేస్తారంటూ యలమంచిలి మండలం ఆర్యపేటలో ఓ అవ్వకు చెబుతూ సూపర్ సిక్స్ బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి ప్రచారం

ఇంటి గుట్టు

హడావుడి కొండంత.. కట్టింది గోరంత



భీమవరం మండలంలో నిర్మాణాలు జరగని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల దృశ్యాలు

'ఎవరూ చేయలేని పని మేం చేస్తున్నాం. గృహ నిర్మాణానికి స్థలాలు ఇస్తున్నాం. వసతి కల్పిస్తున్నాం' అంటూ వైసీపీ ప్రభుత్వం గొప్పలు తప్ప క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పట్టించుకోలేదు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల ఆశలను నీరుగార్చింది. జగనన్న లే అవుట్‌లు పనికి రాని భూములుగా మారాయి. బీడును తలపిస్తున్నాయి. వర్షాలు కురిస్తే చెరువులుగా మారుతున్నాయి. పూడిక చేసిన స్థలాల్లో సగం నిర్మాణాలు నోచుకోలేదు.

ఒకసారి పట్టాలు.. మరోసారి రిజిస్ట్రేషన్

గృహ నిర్మాణంలో ఆప్షన్లు.. చివరికి ఖాళీ స్థలాలు

630 లే అవుట్‌లు.. మెరక చేయనివి 67

49,808 ఇళ్లకు మొదలు పెట్టనివే 30,430

భీమవరం రూరల్, ఏప్రిల్ 1 : గొప్పలకే తప్ప పథకం అమలులో సరైన ప్రణాళిక లేదని వైసీపీ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. పేదల సొంతింటి కలను నెరవేర్చేలా.. ఒకసారి ఇళ్ల స్థలాలని, మరోసారి పట్టాల పంపిణీ అని హడావుడి చేసి, ఈసారి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ అంటూ గోల గోల చేసింది. లబ్ధిదారులను సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించింది. ఇళ్ల నిర్మాణంలో ఆప్షన్‌లు ఎంపిక చేసుకోండి అంటూ కాలయాపన చేస్తూ వచ్చింది. తీరా మంజూరైన సగం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. ఇళ్ల స్థలాలు మంజూరు చేసి నాలుగేళ్లు గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టలేదు. ఇంకా స్థలాలు లే అవుట్‌లుగానే దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 630 జగనన్న లే అవుట్‌లను గుర్తించారు. భూసేకరణ నిర్వహించారు. ఇందులో 49,808 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వాస్తవానికి 2021లోనే లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 8,353 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. బేస్‌మెంట్ స్థాయిలోనే ఏకంగా 7,487 ఇళ్లు ఉన్నాయి. రూఫ్ లెవెల్‌లో 1,487, మరో లెవెల్‌లో 1,170 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 15 శాతం మాత్రమే ఇళ్లు పూర్తయినట్లు కనిపిస్తోంది. మూడేళ్లలో ఇంతే జరిగితే వంద శాతం పూర్తి కావాలంటే ఇంకెన్నాళ్లు వేచి చూడాల్సి వస్తుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

లే అవుట్ పూడికలోనే అవస్థలు

లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలతోనే అవస్థలు మొదలయ్యాయి. గ్రామానికి దూరంగా వెళ్లడానికి సౌకర్యం లేని ప్రాంతాల్లో వీటిని ఇచ్చారు. దీనికితోడు చెరువులు, పల్లపు భూములు ఎంపిక చేశారు. ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేని స్థలాలను సేకరించారు. అదనపు సొమ్ములను వెచ్చించారు. అటు భూయజమానులు, ఇటు ప్రజా ప్రతినిధులు లబ్ధి పొందారు. మార్కెట్ ధరకంటే అధిక సొమ్ములు చెల్లించి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. లబ్ధిదారులకు పనికి రాకుండాపోయాయి. పూడిక చేయకుండా లే అవుట్‌లు దర్శనమిస్తున్నాయి. పూడికకు టెండర్ పిలిస్తే వైసీపీ నాయకులే అందిపుచ్చుకుంటు న్నారు. మొక్కుబడి పూడికలతో సరిపెడుతున్నారు. నిర్మాణానికి అనువుగా లేకుండా చేస్తున్నారు. మరోవైపు 67 పెద్ద లే అవుట్‌లు ఇప్పటికి పూడిక చేయలేదు. అవి చెరువులుగా దర్శనమిస్తున్నాయి. సెకండ్ ఫేజ్‌లో పూడిక అంటున్నారు. అంతే తప్ప అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవడంలేదు. లబ్ధిదారులకు స్థలాలు చూపించడం లేదు. కేవలం పత్రాలు ఇవ్వడానికే పరిమితమయ్యారు.

పూడిక.. రహదారులు సరిలేక వెనుకడుగు

స్థలాలు పూడిక, రహదారులు లేక లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో మరికొందరు లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. చాలా లే అవుట్‌లకు ఇంటి నిర్మాణ సామగ్రి వెళ్లేందుకు రహదారులు లేవు. వాహనాలు వెళ్లడం కష్టతరంగా మారింది. దీనికితోడు డెల్టాలో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలపైన అవుతుండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవడం లేదు. అదనంగా రూ.4 లక్షలు వరకు పెట్టుబడి పెట్టాలి. ఇది లబ్ధిదారునికి భారంగా మారింది. దీంతో ఇల్లు నిర్మించుకోవడం అనే ఆలోచనను విరమించుకుంటున్నారు.

భూమి హక్కు కాగితాల్లోనే

స్థలం ఇస్తున్నాం.. ఇంటి నిర్మాణం చేసి మూడో ఆప్షన్‌గా ఇచ్చేశాం అంటూ భూహక్కు పత్రాలు మాత్రమే ప్రభుత్వం జారీచేసింది. ప్రభుత్వం 2021లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు తహశీల్దార్ల సంతకంతో అందించింది. తిరిగి 2024 జనవరిలో స్థలం రిజిస్ట్రేషన్లు అంటూ హడావుడి చేసింది. చివరికి ఇల్లు లేకుండా రెండు పత్రాలు లబ్ధిదారులకు అందించారు. మధ్య మధ్యలో ఇంటి నిర్మాణం చేయకపోతే పట్టా వెనక్కి తీసుకుంటామని బెదిరింపులు, అధికారుల హడావిడితో లబ్ధిదారులు బెంబేలెత్తిపోయారు. మొత్తంపైన ఇళ్ల నిర్మాణం అంటే లబ్ధిదారులు హడలిపోతున్నారు.

• **బకాయిలు చెల్లించని ప్రభుత్వం**

లే అవుట్‌లు పూడ్చిన కొందరు కాంట్రాక్టర్లు వీధిన పడ్డారు. రూ.20 కోట్లు మేర ప్రభుత్వం బకాయి పడింది. అంటే పూడ్చిన వారికి అవస్థలు తప్పలేదు. దీంతో కొత్తగా లే అవుట్‌లు పూడ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా ఫలితం లేదు. స్థలం ఇచ్చినప్పటి నుంచి లబ్ధిదారునికి ఇళ్ల నిర్మాణంలో ఎన్ని ఆప్షన్లు పెట్టారు. మొదటిది మెటీరియల్ ఇస్తే.. లబ్ధిదారుడు ఇల్లు కట్టుకోవాలి. రెండోది రూ.1.80 లక్షలు ఇస్తారు. లబ్ధిదారుడు నిర్మించుకోవాలి. మూడోది ప్రభుత్వమే నిర్మించి ఇస్తుంది. ఎక్కువ మంది లబ్ధిదారులు మూడో ఆప్షన్‌కే మొగ్గు చూపారు. కానీ ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయలేకపోయింది. దీంతో 30,430 ఇళ్లు శంకుస్థాపన దశను దాటలేదు. మూడో ఆప్షన్ కోసం తణుకు, భీమవరం, పాలకొల్లులో ప్రభుత్వం కాంట్రాక్టర్లను నియమించింది. పాలకొల్లు, తణుకులలో పునాదుల వరకు నిర్మించారు. తర్వాత గిట్టుబాటు కాదంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఇలా జిల్లాలో దాదాపు 11 వేల ఇళ్లు నిలిచిపోయాయి. భీమవరంలో లబ్ధిదారుల నుంచి అదనంగా రూ.1.50 లక్షలు వసూలు చేస్తున్నారు. అలా చెల్లించిన వారికే ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇలా మూడో ఆప్షన్ విఫలమైంది.

బీసీ, ఎస్సీలకు ఊరటేది ?

టీడీపీ హయాంలో బీసీలు, ఎస్సీలకు అధిక మొత్తంలో నిధులు మంజూరయ్యేవి. పట్టణాల్లో రూ.2.50 లక్షల మేర ప్రభుత్వం ఇచ్చేది. దీంతో ఇంటి నిర్మాణం చేపట్టేవారు. సొంత స్థలం ఉంటే రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరేది. ఇప్పుడు కేంద్రం ఇచ్చే రూ.1.80 లక్షలనే మంజూరు చేస్తూ వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. తక్కువ మొత్తంలో ఇంటికి నిధులు కేటాయిస్తుండడంతో లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు స్థలాలు అమ్ముకుంటున్నారు.

4 వేల మంది వలంటీర్ల ఫోన్లు స్వాధీనం

మిగిలిన వారు నేడు, రేపు అప్పగింత



ఆచంటలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, సిమ్‌లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలు అమలులోకి వస్తున్నాయి. వీరితో పెన్షన్ పంపిణీ చేయించకూడదని, వారి వద్ద వున్న ఫోన్‌లు, సిమ్ కార్డులను తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాలో 9,243 మంది వలంటీర్లు ఉండగా, ఇప్పటి వరకు నాలుగు వేల మంది సెల్ ఫోన్‌లు, సిమ్ కార్డులు అప్పగించారు. కొన్నిఫోన్‌లు పాడయ్యాయి. సిమ్ కార్డులను వలంటీర్లు తమ సొంత ఫోన్‌లలో ఉపయోగిస్తున్నారు. అన్ని సిమ్ కార్డులను స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనిని అధికార పార్టీ తన సొంత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోంది. వలంటీర్ల సేవలకు టీడీపీ అడ్డు తగులుతోందని ఎదురుదాడి చేస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం ద్వారా వేతనం పొందారు. పార్టీ కార్యక్రమాలకు వారంతా దూరంగా ఉండాలి. ప్రచారంలో పాల్గొనకూడదు. కానీ వైసీపీ వాటిని బేఖాతరు చేసింది. జిల్లాలో అనేకచోట్ల వలంటీర్లు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. వలంటీర్ల ఫోన్‌లను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేసింది.

పలుచోట్ల సేకరణ

ఆచంట/ఆకివీడు, ఏప్రిల్ 1 : సెల్‌ఫోన్‌లు, డివైజ్‌లు, సిమ్‌కార్డులు సచివాలయాలకు అప్పగించాలని ఆచంట మండలంలోని వలంటీర్లకు మెసేజ్‌లు రావడంతో ఇటీవల వాటిని అప్పగించారు. తర్వాత రెండు రోజులకు మళ్లీ ఎవరివి వారికి ఇచ్చేశారు. తిరిగి ఇప్పుడు వలంటీర్లకు సంబంధించి సెల్‌ఫోన్‌లు, డివైజ్‌లు ఆయా సచివాలయాలకు అందజేయాలని వలంటీర్లకు మెసేజ్‌లు రావడంతో వలంటీర్లు మరలా వీటిని ఆయా సచివాలయాలకు అప్పగిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లు ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమాల్లోను, రాజకీయ నాయకుల ప్రచారాల్లో పాల్గొనకూడదని ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం వలంటీర్ల సెల్‌ఫోన్లు, సిమ్‌లు స్వాధీనం చేసుకుని మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లు వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

మాట ఇచ్చి.. మడమ తిప్పి..!



కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆశలు ఆవిరి

» పాదయాత్ర సమయంలో జగన్ హామీలు
» తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
» సీఎం తీరుపై ఉద్యోగుల మండిపాటు
» ఉమ్మడి జిల్లాలో నష్టపోయిన వేలాది ఉద్యోగులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 1 : పాదయాత్ర సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోయి మాట ఇచ్చి మడమ తిప్పిన సీఎం జగన్ తీరుపై కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజ్ చేయడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్‌లోకి తెస్తామని ఇచ్చిన హామీకి సీఎం జగన్ మంగళం పాడేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు కోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని వాపోయారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 60 శాతం మంది ఆరోగ్య శాఖలో పనిచేస్తుండగా మిగిలిన 30 శాతం మంది ఫారెస్ట్, ఎస్.ఎస్.ఏ, మండల విద్యాశాఖ, పశు సంవర్థక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీలకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో ఎనిమిది వేల మందికిపైగా ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేలు వేతనం లభిస్తోంది. రెగ్యులరైజ్ చేసి ఉంటే రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనం అమలైతే రూ.30 వేలు లభించేది. ఈ రెండు కేటగిరిల్లో ఉద్యోగ భద్రత ఉండేదని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలయ్యేది.

కేంద్ర పథకం అంటూ దాటవేత

కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలు చేయాలని ఉద్యోగులు కోరితే ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదన తెరపైకి తీసుకొచ్చారని వారు పేర్కొంటున్నారు. ఎస్.ఎస్.ఏ, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాకా మాట మార్చారని కేవలం వైద్య ఆరోగ్య శాఖ లో పని చేస్తున్న సుమా రు 300 మందిని మాత్రమే రెగ్యులర్ చేశా రని పేర్కొన్నారు.

అమలు ఊసేలేదు..

కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని, మాట ఇచ్చి మడమ తిప్పారని ఇచ్చిన హామీ అమలు చేయకుండా నమ్మించి మోసం చేశారని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు పేర్కొంటు న్నారు. ఉద్యోగులకు భద్రత, బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను చేయడం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయం చేయడమేనన్నారు.

ప్రచార వ్యయాన్ని లెక్కించాలి : కలెక్టర్



భీమవరం టౌన్, ఏప్రిల్ 1 : సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి వివిధ రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఎన్నికల వ్యయ పరిశీలన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 'ఎన్నికలల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ ప్రచార మార్గాలకు ఖర్చు చేసిన మొత్తాలను గుర్తించి నమోదు చేయాలి. అనుమతి లేనిదే రాజకీయ ప్రచారాలు నిర్వహించరాదు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వాలి. పెయిడ్ న్యూస్, స్టార్ క్యాంపైనర్ల ప్రచారం, ఇతర ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండితే ఓటు హక్కు

ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు పొందేందుకు అర్హులేనని, వీరు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వీటిని పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తామని, వీరంతా మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుం దని తెలిపారు. ఈ ఏడాది మార్చి 30వ తేదీ నాటికి జిల్లాలో 14 లక్షల 61 వేల 337 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 08816-299616, 08816-299617కు ఫోన్ చేసి ఓటు వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

పింఛన్ల పంపిణీకి నిబంధనలు

- ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు వలంటీర్ల ద్వారా ఇంటింటా పింఛన్ పంపిణీ ఉండదు.
- ఈ నెల మూడో తేదీ నుంచి సచివాలయం వద్ద మాత్రమే సెక్రటేరియట్ సిబ్బంది వీటిని అందజేస్తారు.
- పింఛన్‌దారులు పెన్షన్‌కు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు లేక ఇతర గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలి.
- పింఛన్ పాస్ పుస్తకంలో సీఎం జగన్ ఫొటో వున్నందున అది తీసుకుని రాకూడదు. ఇది ఎన్నిక కోడ్‌కు విరుద్ధం.
- సచివాలయం వద్ద తొక్కిసలాట లేకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్, బయోమెట్రిక్ పరికరం జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించాలి.
- పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఆథరైజేషన్ లెటర్ తమ లాగిన్‌లో జనరేట్ చేసి అందించాలి.
- బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసే వారు ఆథరైజేషన్ లెటర్ ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలి.
- అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి సంబంధించి ఏ విధంగా పంపిణీ చేయాలనే విషయాన్ని తెలియచేస్తామని అధికారులు చెప్పారు.
- సచివాలయ సిబ్బందికి లాగిన్స్ ఇవ్వనుండడంతో అందరికి అన్ని పేర్లు కనిపిస్తాయి. క్లస్టర్ మ్యాపింగ్ ఉండదు.

- భీమవరం టౌన్



కిల్లర్.. డాక్టర్ !

» ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులపాలు
» అప్పు ఇచ్చిన వారికి మత్తు ఇంజెక్షన్లు.. ఒకరి మృతి.. ఇద్దరు ఆసుపత్రి పాలు
» ఏలూరులో అరెస్టు చేసిన పోలీసులు.. కలకలం రేపిన ఘటన

మామపై యాసిడ్ దాడి

చికిత్స పొందుతూ మృతి.. తన భార్యను పంపడం లేదని అల్లుడి ఘాతుకం -7లో



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన యజమాని

మా ఆవుదూడ పుట్టిన రోజు.. భోజనాలకు రండి..

గొరగనమూడిలో పుంగనూరు గోవుకు బర్త్‌డే వేడుకలు

పాలకోడేరు, ఏప్రిల్ 1 : చిన్నపిల్లల పుట్టిన రోజు వేడుకలు ఎంత ఘనంగా నిర్వహిస్తామో అంతకు దీటుగానే ఓ గోవుకు మొదటి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయినవాళ్లను పిలిచి విందు భోజనాలు పెట్టారు. ఈ విచిత్ర సంఘటన గొరగనమూడిలో సోమవారం చోటు చేసుకుంది. గొరగన మూడి గ్రామానికి చెందిన పంపన రామకృష్ణ ఓ గోవును పెంచుకుంటున్నాడు. ఆ గోవుకు చిన్న ఆవు దూడ ఏడాది క్రితం జన్మించింది. పుట్టిన సమయంలోనే ఆవు దూడకు బెల్లంతో తులాభారం నిర్వహించి భోజనాలు పెట్టారు. ఆ గోవుకు మొదటి సంవత్సరం పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిం చారు. మూడు రోజుల ముందు నుంచే గ్రామంలో అయినవారందరి ఇంటింటికీ వెళ్లి మా ఆవు దూడకు మొదటి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నామని భోజనాలు కూడా ఏర్పాటు చేశామని కబుర్లు అందించారు. కేక్ కట్ చేసి దూడకు తినిపించారు. బాణసంచా కాల్చారు. వేడుకకు వచ్చిన సుమారు 200 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్థులు కూడా పుట్టిన రోజు వేడుకలు గురించి చెప్పుకున్నారు. విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, గొరగనమూడి మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, రుద్రరాజు జానకిరామరాజు, బల్లా పరమేశ్వరరావు, ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్

కిల్లర్.. డాక్టర్ !



భానుసుందర్

- ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులపాలు
- అప్పు ఇచ్చినవారికి మత్తు ఇంజెక్షన్లు
- ఒకరు మృతి.. ఇద్దరు ఆసుపత్రి పాలు
- అరెస్టు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులు చేసి తీర్చే మార్గం కానరాక అప్పు ఇచ్చిన వారిని అనారోగ్యం పాలు చేయడానికి మత్తు ఇంజక్షన్లు చేసి ఆపై ఆసుపత్రిలో చేర్పించి అప్పు మాఫీ చేసుకునేందుకు పథకం పన్నిన ఒక జూనియర్ డాక్టర్‌ను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ వివరాలు తెలిపారు. ఏలూరు చొదిమెళ్ళకు చెందిన కొవ్వూరి భానుసుందర్ ఫిలిపైన్స్‌లో ఎంబీబీఎస్ చేస్తున్నప్పుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో అప్పులు చేసి బెట్టింగులు వేశాడు.గతేడాది మే నెలలో ఇండియాకు వచ్చిన తరువాత మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అర్హత పరీక్ష రాయాల్సి ఉంది. క్లినికల్ అసిస్టెంట్ వైద్యునిగా ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఏలూరు వన్‌టౌన్‌లోని వేణుగోపాలస్వామి గుడి ప్రాంతానికి చెందిన వాకచర్ల హిమతేజ వద్ద మూడు లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ సొమ్ము ఇవ్వాలని హిమతేజ అడుగుతున్నాడు. దీంతో హిమతేజ వద్దకు వెళ్లి తాను వైఎస్ఆర్ క్లినిక్‌లో పని చేస్తున్నానని రక్తనమూనాలు సేకరిస్తున్నానని, ఏదైనా అనారోగ్యం ఉంటే ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందని నమ్మబలికి ప్రణాళిక ప్రకారం ముందుగా తనతోపాటు గవర్నమెంట్ మార్ఫిన్ ఇంజక్షన్ (మత్తు ఇంజక్షన్) ఎక్కించాడు. హిమతేజ తీవ్ర అస్వస్థతతకు గురయ్యాడు. అతడిని ఆసుపత్రిలో చేర్పించి ఆసుపత్రి బిల్లు కట్టాలని ఎదురు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఉద్దేశ్యపూర్వకంగానే తనకు ఇంజక్షన్ చేసి మోసగించాడని హిమతేజ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది కేసు నమోదు చేశారు. అతని కోసం గాలిస్తుండగా పరారయ్యాడు. సత్రంపాడుకు చెందిన రాయల్ వెంకట్‌కు కూడా ఇలాగే ఇంజక్షన్ చేశాడు. అతను కూడా అనారోగ్యం పాలయ్యాడు. చొదిమెళ్ళ పోస్టుమాస్టర్ బత్తిన మల్లేశ్వరరావు అలియాస్ తంబి 63) అనే ఆయన వద్ద 15 లక్షలు పైగా అప్పులు తీసుకున్నాడు. ఆయన ఇంటికి తరచుగా వెళ్ళి వైద్యం అందించేవాడు. చివరకు అతన్ని హతమారిస్తే 15 లక్షలు కట్టాల్సిన అవసరం లేదని గతేడాది డిసెంబరు 24న మల్లేశ్వరరావుకు మార్ఫిన్ ఇంజక్షన్ అధిక మోతాదులో ఇచ్చాడు. అతని ఇంట్లో ఉన్న బంగారు బ్రాసిలేట్, బంగారు చైన్, లక్షన్నర నగదు అపహరించుకుపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్ఐలు లక్ష్మణబాబు, నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్ళు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌లు నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఏలూరు మినీ బైపాస్ పడమర లాకుల వద్ద అనుమానాస్పదంగా ఉన్న కొవ్వూరి భానుసుందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఈ నేరాలు అన్నీ అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం..

ఆకివీడు, ఏప్రిల్ 1: తెలంగాణ మద్యం తీసుకొస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రెండు ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన భూమన కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి తెలంగాణ మద్యం రెండు ఫుల్ బాటిల్స్‌తో వస్తుండగా ఉప్పుటేరు చెక్‌పోస్టు దగ్గర పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ఒక్కో బాటిల్ విలువ రూ.2 వేలు ఉంటుందన్నారు.



1-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.52
జంగారెడ్డిగూడెం-1	241	235	239.88
జంగారెడ్డిగూడెం-2	241	235	239.65
కొయ్యలగూడెం	240	235	239.90
గోపాలపురం	240	235	238.62



ఇప్పుడు సోషల్ మీడియాదే హవా.. అరచేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు.. ప్రపంచంలో ఏ మూల ఏది జరిగినా ఇట్టే తెలిసిపోతోంది. పట్టణాల నుంచి పల్లెల వరకు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్ట్రాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర యాప్‌లను వినియోగించే వారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ పార్టీలకు సోషల్ మీడియానే ఓ ప్రధాన అస్త్రంగా మారింది. తమ గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటూ ప్రత్యర్థులపై బురద జల్లుతూ పోస్టింగ్‌లు పెడుతున్నారు. అయితే.. తస్మాత్ జాగ్రత్త! సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం చేస్తే ఎన్నికల సంఘం చూస్తూ ఊరుకోదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుంది..

● ఇష్టానుసారం పోస్టింగ్‌లు కుదరవు



సామాన్యులతో పాటు ఉద్యోగులు సైతం ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్ట్రాగ్రామ్, యూట్యూబ్‌లలో పోస్టులు పెడుతుంటారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో వీటిపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఉంచింది. ఏ పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. జిల్లాలో ఉన్న పలుశాఖల అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ పార్టీలకు పరోక్షంగా సహకరించినా, ప్రయత్నించినా ప్రత్యర్థి పార్టీల వ్యక్తులకు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పెట్టినా ఇక అంతే సంగతులు. పోస్టింగులు ఊస్టింగ్ అవుతాయి. పోలింగ్ ముగిసి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవలసి వస్తుందని ఎన్నికల సంఘం అధికారులు హెచ్చరిస్తున్నారు.

- ప్రచారంలో హైటెక్‌దే హవా !
- పెచ్చుమీరుతున్న రాజకీయ ప్రచారాలు
- సోషల్ మీడియాపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే!

కోడ్ తప్పితే జైలు తప్పదు



తప్పుడు ప్రచారాలపై నిఘా

భీమవరం క్రైం, ఏప్రిల్ 1 : ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు టెక్నాలజీని ఆశ్రయిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థుల ఫొటోలతో గ్రాఫిక్స్ తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు.ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సామాజిక మధ్యమాలలో తప్పుడు ప్రచారాలను ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తామని, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు.

● **67 ఐటీ యాక్ట్:** ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

● **సెక్షన్ 354:** ఉద్దేశ్యపూర్వకంగా ఒక మహిళను లక్ష్యంగా చేసుకొని వేధిస్తే నేరుగా గాని, సోషల్ మీడియా వేదికల ద్వారా గాని అదే పనిగా సంప్రదించడం, వెంట పడటం దూషించడం, అవమానించడం, వేధించడం వంటివి తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు

● **సెక్షన్ 123:** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడి గురిచేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.

● **సెక్షన్ 125:** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో ఈ రెండింటినీ విధించే అవకాశం ఉంది.

● **సెక్షన్ 126:** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 127:** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడితే నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 128:** బహి రంగంగా ఓటేసినా 3 నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 129:** అధికారులు, సిబ్బంది, పోలీసు లు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికి 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 130:** పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చెయ్య కూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 131 :** పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారి అయినా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. 3నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 132 :** ఓటేసే సమయంలో నిబంధనలు పాటించని వారికి 3 నెలల జైలు, లేదా జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 134 :** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా .

● **సెక్షన్ 134(బీ):** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి 2 నెలలు జైలు శిక్ష, జరిమానా..

● **సెక్షన్ 135 :** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 135(బీ) :** ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా కేసు నమోదు చేస్తారు. జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

● **సెక్షన్ 134(ఏ):** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటు, పోలింగ్ ఏజెంటు, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. దీనికి 3 నెలలు జైలు, జరిమానా ఉంటుంది.

● **సెక్షన్ 49 (పి):** ఒక వ్యక్తి ఓటు మరో వ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటర్ 49(పి) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు.

గ్రూప్ అడ్మిన్ల బాధ్యతలు

వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి గ్రూప్‌లో ప్రతీ పోస్టుకి బాధ్యత తీసుకోవాలి.గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతీ సభ్యుడు తప్పకుండా అడ్మిన్‌కి తెలిసి ఉండాలి. అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరైనా సభ్యులు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలి. ఆ వివాదాస్పద పోస్టింగ్ సంబంధించి అడ్మిన్ ఏం చర్యలు తీసుకోకుంటే అతడిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు. అడ్మిన్ వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం. ఐపీసీ సెక్షన్ 153 (ఎ) కింద శిక్ష విధిస్తారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. కుల, మత వర్గాల మధ్య విభేదాలకు, విద్వేషాలకు దారి తీసే పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, వీడియోలు వంటివి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో గ్రూప్ అడ్మిన్లు, సభ్యులు పోస్ట్ లేదా షేర్ చేస్తే శిక్షార్హులు అవుతారు.

తప్పుడు ప్రచారాలపై ఫిర్యాదు చేయండి : ఎస్పీ అజిత

సోషల్ మీడియా వాడుకపై సంక్షిప్త సమాచార కరపత్రాల (బ్రోచర్)ను సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్ 70362 26688కు తప్పుడు ప్రచారాలపై ఫిర్యాదు చేయాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, అదపు ఎస్పీ (ఎస్బీ) రవికుమార్, తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి, భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, నర్సాపురం డీఎస్పీ శ్రీనివాసరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ సత్యనారాయణ, సెబ్ డీఎస్పీ వెంకటరమణ, దిశా డీఎస్పీ నున్న మురళీకృష్ణ, సీసీఎస్ డీఎస్పీ యుగంధర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అజిత, అధికారులు

విస్తృతంగా తనిఖీలు

నగదు, మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 15 వేల 240 రూపాయల విలువైన 47.12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు రెండు లక్షల 16 వేల 600 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారన్నారు.

పిప్పరలో రూ.75 వేలు సీజ్

గణపవరం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వ్యక్తి కోడ్‌ను ఉల్లంఘించరాదని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ కోరారు. సోమవారం పిప్పర మూడు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒక వాహనంలో రూ.75 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, అధికారులు టీఎల్ సరస్వతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కె.కోటలో రూ.75 వేలు స్వాధీనం

కామవరపుకోట : కామవరపుకోట పంచాయతీ కొత్తూరు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఎన్నికల చెక్‌పోస్టు వాహనాల తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి రు.73 వేలు ఎన్నికల అధికారి మొహిద్దీన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తడికలపూడి ఏఎస్ఐ వీరాస్వామి, ఫ్లయింగ్‌స్కాడ్ అధికారి ఎస్.సత్యవాణి, గణేష్ పాల్గొన్నారు. వాహనాలపై నిఘా పెంచాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర అన్నారు. సోమవారం ఆయన చెక్‌పోస్టును పరిశీలించారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కుక్కునూరు సందీప్ అనే వ్యక్తి నుంచి రూ.69,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏఆర్‌వో, తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్‌టీ బృందం సభ్యులు ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా, హెడ్‌కానిస్టేబుల్ జె.మోషే, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

235 మంది బైండోవర్

ఆకివీడు : ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు 235 మందిని బైండోవర్లు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. రౌడీషీటర్స్, అను మానితులు, ఇతర పోలీసు కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేశామన్నారు.



కె.కోట చెక్ పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రంగుల వాహనంలోనే రేషన్ పంపిణీ

పెంటపాడు, ఏప్రిల్ 1 : ఎన్నికల కోడ్ అమలుపై అధికారుల తీరు ఇంకా మారడం లేదు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే ప్రభుత్వ వాహనాలపై రంగులు తీయడం లేదు. సోమవారం నుంచి మండలంలో రేషన్ పంపిణీని అధికారులు మొదలు పెట్టారు. వాహనానికి ఉన్న రంగులు మాత్రం తొలగించలేదు. కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికార పార్టీ రంగులతో ఉన్న వాహనంపై రేషన్ ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



పెంటపాడు మండలం రాచర్లలో వైసీపీ రంగుల వాహనంలోనే రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

సంపద కేంద్రం రంగు మారింది

ఇరగవరం, ఏప్రిల్ 1 :రాపాక గ్రామంలో సంపద తయారీ కేంద్రానికి ఉన్న వైసీపీ రంగులు తొలగాయి. కోడ్ అమలులోకి వచ్చినా సంపద కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, శిలాఫలకాల దిమ్మలకు వైసీపీ రంగులతోనే కనిపిస్తున్నాయి. దీనిపై గ్రామాల్లో సక్రమంగా కోడ్ అమలు కావడం లేదని ఆంధ్రజ్యోతిలో 'వీటికి కోడ్ వర్తించదా' అనే శీర్షిక శనివారం వార్త ప్రచురణ జరిగింది. దీనిపై స్పందించిన రాపాక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు సంపద కేంద్రానికి సున్నం వేయించారు.



పాటదారుడికే రేవు బాధ్యతలు అప్పగింత

నరసాపురం టౌన్, ఏప్రిల్ 1: మాధవాయిపాలెం రేవు నిర్వహణ బాధ్యతల్ని సోమవారం పాత పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి అప్పగించింది. మళ్లీ పాట నిర్వహించే వరకు ఆయనే చేపట్టనున్నారు.ఇందుకు రోజుకు ప్రభుత్వానికి రూ.1.05 లక్షలు చెల్లించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గత నెల మార్చిలో పాట నిర్వహించాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో రద్దు అయింది. ఈ నేపథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశమై రోజువారి పద్ధతిలో ధవేజీకి అప్పగించాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపింది. జిల్లా అధికారులు ఆమోదించడంతో పాట పెట్టే వరకు పాత పాటదారుడే నిర్వహించనున్నారు.

సీనియర్ లైన్‌మేన్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఓ సీనియర్ లైన్‌మేన్‌పై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్ డీ3 విద్యుత్ సెక్షన్‌లో కొత్తపల్లి రామకృష్ణ సీనియర్ లైన్‌మేన్‌గా పనిచేస్తున్నారు. సత్రంపాడులోని ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ ఇంటికి విద్యుత్ సమస్య ఏర్పడడంతో గత నెల 12న అక్కడ విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు జూనియర్ లైన్‌మేన్ అయిన వినోద్ బాబును వెంట తీసుకుని వెళ్లారు. వినోద్‌బాబును విద్యుత్ స్తంభం ఎక్కించి పనులు చేయిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ రావడంతో వినోద్‌బాబు విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స నందించారు. వినోద్‌బాబు ప్రమాదానికి గురవడానికి రామకృష్ణ నిర్లక్ష్యమే కారణమని వినోద్‌బాబు భార్య నవ్యశ్రీ ఫిర్యాదు చేయడంతో సోమవారం రామకృష్ణపై త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు హెచ్‌సీ ఏసోబు కేసు నమోదు చేశారు.

నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 1: రమణక్కపేట అరుంధతి కాలనీలో తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాద్, కాలనీలో నీటి సరఫరా చేసే మంచి నీటి ట్యాంకులు, సంబంధిత పైప్‌లైన్‌లను పరిశీలించారు. వాటర్ ట్యాంకుల్లో నీరు ఉన్నప్పటికీ కుళాయిల్లో నీరు రాకపోడంతో అక్కడక్కడ పైప్‌లైన్‌లను తవ్విచూశారు. పైప్‌లైన్ బ్లాక్ అవడం వల్లే ఒక వాటర్ ట్యాంక్ నుంచి నీరు రావడం లేదని గుర్తించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పైప్‌లైన్‌లో అక్కడక్కడ బ్లాక్ అవడం వల్ల సమృద్ధిగా నీరు రావడం లేదని పాత పైప్‌లైన్‌ను తొలగించి, సుమారు 110 మీటర్ల హెచ్‌డీపీఈ పైప్‌లతో పైప్‌లైన్ వేసే పనులను ప్రారంభిస్తామన్నారు.

క్రైం కార్నర్

ఈస్టర్ పండుగ కోసం వస్తుండగా ప్రమాదం

భర్త మృతి..భార్యకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన పవన్ కుమార్

పోలవరం, ఏప్రిల్ 1 : ఈస్టర్ పండుగ కోసం భార్యతో కలిసి వస్తూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలపాలైన సంఘటన కోట రామచంద్రపురం ఐటీడీఏ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన చిన్నం పవన్ కుమార్ (28) కుటుంబంతో సహా ఇటీవల కన్నాపురం పుగాకు సీజను పనికి మకాం వెళ్ళాడు. ఈస్టర్ పండుగ సందర్భంగా తన భార్యతో బైకుపై పోలవరం వస్తుండగా ఐటీడీఏ సమీపంలో మలుపు వద్ద బైకు అదుపు తప్పి చెట్టుని ఢీకొట్టడంతో పవన్ కుమార్, అతని భార్య వేణుకి తీవ్ర గాయాలయ్యాయి. వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పవన్ కుమార్ మృతి చెందగా భార్యని మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఐదు నెలల క్రితమే ఇద్దరికి వివాహమైందని రోడ్డు ప్రమాదం కుటుంబంలో విషాదం మిగిల్చిందని మృతుడి తండ్రి వీరన్న కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరి అనుమానాస్పదస్థితి మృతి

చింతలపూడి, ఏప్రిల్ 1:చింతలపూడికి చెందిన వివాహితుడు నరం రమేష్ (30) మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో సోమవారం కనుగొన్నారు. వృత్తిరీత్యా సెలూన్ నిర్వహిస్తుండటాడని, వారం రోజుల క్రితం ఒక అమ్మాయిని తీసుకువెళ్లాడని ఇంట్లో పెద్దలు మందలించారు. ఆ కోపంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అతని చేలోనే మృతదేహాన్ని గొర్రెల కాపరులు కనుగొని సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్ళి పోలీసులు పరిశీలించారు. అప్పటికే మృతదేహం బాగా కుళ్ళిపోయిందని, చేతిపై బ్లేడుతో కోసుకున్న గీతలు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

ఆటో-బైక్ ఢీ..యువకుడికి గాయాలు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 1: బర్రింకలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయ పడ్డాడు. గ్రామానికి చెందిన కుంజం ప్రేమ్‌కుమార్ జీలుగుమిల్లి వైపు బర్రింకలపాడు నుంచి వస్తుం డగా నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రమాదవశాత్తు ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని జ్యూట్ మిల్లు కార్మికుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 1 : కారణం తెలియదు కాని ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని కొత్తూరులో ఉన్న ఇందిరా కాలనీకి చెందిన గంపా చంటి (45)కు భార్య భవానీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు సంవత్సరాల క్రితం భార్య, పిల్లలతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. జ్యూట్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం తాను ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకున్నారు. సాయంత్రం ఇరుగు పొరుగు వారు చూసి ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్ మృతి

పెదపాడు, ఏప్రిల్ 1: సిమ్మెంట్ లోడుతో వెళుతున్న లారీలో డ్రైవర్ అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటనపై పెదపాడు పోలీసులు సోమ వారం కేసు నమోదు చేశారు. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన తోపూరి కోటేశ్వరరావు (62) మార్చి 31వ తేదీన బయలుదేరి సిమ్మెంట్ లోడుతో జగ్గయ్యపేట నుంచి విశాఖపట్నం వెళుతూ మార్గమధ్యలో పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అప్పటికే మృతి చెందిన కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి..కేసు నమోదు

యలమంచిలి/ఆకివీడు ఏప్రిల్ 1: శిరగాలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై సోమవారం దాడి చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. మూడు పందెం కోళ్ళు, నాలుగు మోటారు సైకిళ్లు, రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. చెరుకుమిల్లిలో ఐదుగుర్ని అదుపులోకి తీసుకొని రెండు కోడిపుంజులు, రెండు కత్తులతో పాటు రూ.4,500 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

మామపై అల్లుడు యాసిడ్ దాడి

చికిత్స పొందుతూ మృతి



నాగేశ్వరరావు(ఫైల్)

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 1 :పిల్లనిచ్చిన మామపై అల్లుడు యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో చోటు చేసుకుంది. యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రగడ నాగేశ్వరరావు (65) చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ రాజేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమార్తె కృష్ణవేణికి, టి.నరసాపురం మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రంగిశెట్టి రమేష్‌కు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రమేష్ తన భార్య కృష్ణవేణిని వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులు తాళలేక గత సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తన భార్యని మావయ్యే దగ్గర కాకుండా దూరం పెడుతున్నాడని రమేష్ అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో లక్కవరంలో ఇంటిలో నిద్రిస్తున్న నాగేశ్వరరావుపై రమేష్ బ్యాటరీలలో వినియోగించే యాసిడ్ వాటర్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాగేశ్వరరావు పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేశ్వరరావు సోమవారం ఉదయం మృతి చెందాడు. దాడికి పాల్పడిన రమేష్ పరారీలో ఉండటంతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనుమదంలో అమ్మవార్ల జాతర



పోడూరు, ఏప్రిల్ 1: పెనుమదంలోని శ్రీమహాలక్ష్మమ్మ, చల్లాలమ్మ, గంట్లమ్మ, ధనకొండ్లమ్మ, పోలేరమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర అత్యంత ఘనంగా జరిగింది. జాతరకు పరిసరప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు పోటెత్తారు. అమ్మవార్ల ఘటాలతో ఆశాదులు నిర్వహించిన నృత్యప్రదర్శనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. డప్పులు, భజంత్రీలు, తీన్మార్ డప్పులు, బుట్టబొమ్మలు, కోయడాన్సులు, కాళికామాత వేషధారణలు, బాణసంచా కాల్పులతో భక్త జనసందోహం మధ్య వైభవంగా అమ్మవార్ల జాతరను నిర్వహించారు. కోట సుబ్బారావు కుమారుడు రాజేష్ కుటుంబ సభ్యులు విరాళంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కొళగారం కమిటీ చైర్మన్ కర్రే రామచంద్రరావు, దేవస్థానం మాజీచైర్మన్ దేవరపు వీరరాఘవులు, ఈవో పిల్లి సూర్యనారాయణ, తంగెళ్ల సత్యనారాయణ, దేవరపు దొరబాబు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేరెళ్ళమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 1: వరధనం గ్రామంలో గ్రామ దేవత నేరెళ్ళమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. శిల్పి ఇంటి ప్రసాద్, మాదిరెడ్డి నాగు, గునిశెట్టి కృష్ణ, పెచ్చెట్టి ఏడు కొండలు, మల్లిపూడి దుర్గా ప్రసాద్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఆకివీడులో మజ్జిగ పోస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ గంగాధరరావు

ఆకివీడు, ఏప్రిల్ 1: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం మహా పుణ్యకార్యక్రమం అని ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధర రావు అన్నారు. కొత్త బస్టాండ్‌కు వెళ్ళే మాదివాడ సెంటర్‌లో రాధా రంగ మిత్రమండలి నిర్వాహకుడు నిమ్మల నాగు, పుప్పాల చిన్న, మోటుపల్లి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతి వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా చైర్మన్ మోరా జ్యోతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్‌వలీ, దాసరి బాల కృష్ణ, రమేష్, గునుకుల కొండయ్య పాల్గొన్నారు.

పెనుమంట్ర: వేసవి దాహార్తిని తీర్చేందుకు ప్రయాణికులకు పాదచారులకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయని పాలకొల్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్వీ రాఘవరెడ్డి అన్నారు. సోమవారం మార్టేరులో రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చెయ్యగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం సభ్యులు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, గుడిమెట్ల రామారెడ్డి, అల్లం భాస్కర్ రెడ్డి, చింత ధర్మ వీరనారాయణరెడ్డి, మల్లిడి మీరా రెడ్డి, సత్తి సుబ్బన్న రెడ్డి పాల్గొన్నారు.

4న సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ

ఆకివీడు, ఏప్రిల్ 1: అర్హులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు గురువారం ఆయా సచివాలయాల్లో పొందాలని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ తెలిపారు. పట్టణంలో సుమారు 3,400 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. మైకు ద్వారా సమాచారం తెలిజేస్తున్నామన్నారు. పింఛను పుస్తకాలు తీసుకురాకుండా ఆధార్‌కార్డు తీసుకొచ్చి సచివాలయ సిబ్బందికి చూపించి పింఛన్ పొందాలన్నారు. ఎండ సమస్య లేకుండా ఉదయం, సాయంత్రం అందజేయడం జరుగుతుందన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆకివీడు, ఏప్రిల్ 1: జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల, ఈస్ట్‌పాలెం, సిద్ధాపురంరోడ్, సమతానగర్ పరిధిలోని ఎంపీపీ పాఠశాలల్లోని బూత్‌లను సెక్టార్ ఆఫీసర్ ఎంఆర్పీ ప్రియాంక పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నవోదయకు విద్యార్థినుల ఎంపిక

ఆకివీడు, ఏప్రిల్ 1: నవోదయ పరీక్షకు విద్యార్థినీ ఎంపికైందని ఈస్ట్‌పాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.వర్ధిని తెలిపారు. తమ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న యు.జోషిత శ్రీవర్షిణి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25కు సంబంధించి ఆరోవ తరగతిలో ప్రవేశానికి జరిగిన ఎంపికలో విజయం సాధించిందన్నారు.

మొగల్తూరు: గుంటపల్లవపాలెం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చంద్రిక ఇటీవల నిర్వహించిన నవోదయ పరీక్షల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాసింది. పరీక్షల్లో చంద్రిక ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంకే త్రినాధ్‌రావు, కుక్కలవారితోట గ్రామ సంఘ పెద్దలు అభినందించారు.

అన్నసమారాధన

కాళ్ళ, ఏప్రిల్ 1 : బొండాడ గ్రామంలో పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల జాతర ముగిసింది. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో నేవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నే నాగరాజు, పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవార్ల ప్రసాదం స్వీకరించారు.

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు

ఇళ్ల వద్దనే ఓటు వేసే అవకాశం

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 : వృద్ధులు, విభిన్న ప్రతిభా వంతులకు వారి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. సోమవారం విజయవాడ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగం, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై సంబంధించిన అధికారుల బాధ్యతల వారు నిర్వహించాల్సిన విధులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85సంవత్సరాలు దాటిన వయో వృద్ధులకు సదరం ధ్రువీకరణ పత్రం ఆధారంగా 40 శాతం దాటిన అంగ వైకల్యం ఉన్న విభిన్న ప్రతిభా వంతులకు ఓటు వినియోగంలో అనుసరించాల్సిన నిబంధనల మేరకు వ్యవహరించి వారి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశన్ని కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరేన్స్‌లో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్, జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, అధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు నివారించాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 : జిల్లాలో తీరప్రాంతం, లంక గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.యస్. జవహర్ రెడ్డికి తెలిపారు. సోమవారం రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.యస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి చెరువులను, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచినీటి చెరువులకు కాల్వలు కట్టేసేలోగా పూర్తిస్థాయిలో నింపుకోవాల న్నారు. నీటి నిల్వలను అసరించి వేసవి కాలం తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, డ్వామా పీడీ యం.ప్రభాకర రావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్. విక్టర్, జిల్లా ఆర్డబ్ల్యూయస్ అధికారి బి.వి.వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

భీమవరం రూరల్, ఏప్రిల్ 1 : ప్రభుత్వ పాలనను ప్రతీ ఇంటి ముంగిటకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికలలో వైసీపీకి అఖండ విజయం దక్కేలా పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు.









జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు... అజ్జరంలో యువకులతో మాట్లాడుతున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి.. వెలివెల గ్రామంలో దివ్యాంగునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు... వెలగలేరులో పితాని సమక్షంలో టీడీపీలో చేరిక

అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛన్ : పితాని

పెనుమంట్ర, ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు 4వేల పింఛన్ అందిస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాలు వల్లే పింఛన్ దారులకు చెల్లించేందుకు ఖజానాలో సొమ్ము లేకుండా సంక్షేమ పథకాలకు బటన్లు నొక్కి, ఎన్నికల కోడ్ సమీపిస్తున్న వేళ అనుకూల కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించి ఖజానాను ఖాళీ చేసి పెట్టారని ఆరోపించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయాలని వాటికి కావలసిన సొమ్ము ఖజానాలో ఉన్నాయో లేవో జగన్ రెడ్డికి తెలియదా అంటూ నిప్పులు చెరిగారు.

• వెలగలేరు కోమటి చెరువు దుబ్బులు పుంత ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది వైసీపీ నుంచి పితాని సత్యనారాయణ సమక్షంలో తెలుగుదేశం కండువాలు కప్పుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

పింఛన్లపై వైసీపీ తప్పుడు ప్రచారం: పత్సమట్ల

గణపవరం, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీ వ్యవహారంపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాల్ని ప్రజలు గమనిస్తున్నారని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. సోమవారం గణపవరంలో 25 మందికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ధర్మరాజు మాట్లాడుతూ పింఛన్లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జనసేన కూటమికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. గణపవరానికి చెందిన చిల్లా శ్రీనివాస్, మునగాల కోటేశ్వరరావు, అలుమోలు సీతారామయ్య, మహంకాళి రాము, తదితరులు జనసేనలో చేరారు.

అజ్జరం కాలనీలో ఆరిమిల్లి ప్రచారం

తణుకు, ఏప్రిల్ 1: అజ్జరం కాలనీలో టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటిలోని ఓటర్లను కలసి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేసే పథకాలపై వివరించి వైసీపీ దుర్మార్గ పాలనకు చమరగీతం పాడాలని అన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ప్రభుత్వం మారిందని, వైసీపీ దుర్మార్గ ఆలోచనతో ఇళ్లను పూర్తి చేయలేదని అన్నారు.

ఆరిమిల్లి సతీమణి ప్రచారం

సజ్జాపురంలో ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు పాలనను తెచ్చుకోవాలని, ఓటర్లంతా చైతన్యంతో రాధాకృష్ణను గెలిపించుకోవాలని కోరారు.

వైసీపీ అసత్య ప్రచారం నమ్మొద్దు

పింఛన్ల పంపిణీపై వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మవద్దని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను అడ్డు పెట్టుకుని అక్రమాలు చేయాలన్న వైసీపీ కుట్రను ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పింఛన్ పంపిణీ చేసే వెసులుబాటు ఉందని, అయినా పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారని వివరించారు.

ఆరిమిల్లికి పలు సంఘాల మద్దతు

తణుకు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను సోమవారం భవన నిర్మాణ కూలీల సంఘ నాయకులు, శ్రామికులు కలసి తమ మద్దతు ప్రకటించారు. అలాగే ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కలసి మద్దతు తెలిపింది. వైసీపీ కక్ష కట్టి ఇసుక రవాణా ఆపించడంతో చాలా కాలం నిర్మాణ రంగం కుదేలైందని, కారుమూరికి కప్పం కట్టకపోతే నిర్మాణాలు జరిగే పరిస్థితి లేదని, వేధింపులు తట్టుకోలేక చాలా మంది నిర్మాణాలు ఆపేశారని వివరించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి లేదు: సుష్మ

ఆకివీడు, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వం ప్రతీ విషయంలో ప్రతిపక్షాలపై బురద చల్లడంతప్పా అభివృద్ధి చేసిందేమిలేదని ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మా అన్నారు. 20, 1, 2 వార్డులలో ఆమె ప్రచారం చేసి మాట్లాడారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఈ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉండడంతో చేసేది లేక కొత్త నాటకానికి తెరలేపారన్నారు. పార్టీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, బత్తుల రవలి, గొడవర్తి మణికంఠ, మోటుపల్లి సత్యనారాయణ, సుబ్బారావు, అడపా అబ్బులు పాల్గొన్నారు.

జగన్‌కు దళితులు గుణపాఠం చెప్పాలి: ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 1 : రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు దళితులు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. వెలివెలగ్రామంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళిత వర్గాలకు ఎంతగానే ఉపయోగ పడే బిఆర్ అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి తన పేరు పెట్టుకుని అంబేడ్కర్‌ను అవమానపరిచిన ఘనత జగన్‌దేనని అన్నారు. గత ఎన్నికల్లో 50శాతం ఓట్లు, సీట్లు ఇచ్చిన దళితులపై రోజు రోజుకు దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్న పట్టించుకోని సీఎం జగన్‌కు దళితులే బుద్ధి చెప్పాలని కోరారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన 10 దళిత కుటుంబాలు వైసీపీ రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఇళ్ల వద్దనే పింఛన్లు ఇవ్వాలి

పాలకొల్లు టౌన్: పింఛన్ల వ్యవహారంలో సీఎం జగన్ రాజకీయ లబ్ధితో మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పెన్షన్ల సొమ్మును సచివాలయాల వద్ద పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పడం వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడమే అన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువుగా ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలే గాని సచివాలయాల్లో ఇస్తామనడం జగన్ లో మానవత్వం లేనట్టుగా కనిపిస్తుందని ఎమ్మెల్యే రామానాయుడు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల సతీమణి ప్రచారం

యలమంచిలి, ఏప్రిల్ 1: జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో దళితవాడల అభివృద్ధికి రూపాయి వెచ్చించిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. ఆర్యపేట గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి నిమ్మల సూర్యకుమారి సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి సూర్యకుమారి, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

మొగల్తూరు, ఏప్రిల్ 1: చంద్రబాబు అమలు చేసే బీసీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీసీ సంఘం నాయకులు కడలి గోపి, కొప్పాడ రవి అన్నారు. సోమవారం మొగల్తూరు కొమటితిప్ప గ్రామంలో నిర్వహించిన బీసీ సదస్సు నిర్వహించారు. ఆనంతరం వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే చంద్రబాబు ఆదరణ, బీమా రూ.10లక్షలు, బీసీ కార్పొరేషన్‌లతో పాటు ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలంటే మళ్లీ అధికారంలోకి టీడీపీ రావాలన్నారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జనసేన అభ్యర్థి నాయకర్‌లు విచ్చేశారు. టీడీపీకి బీసీలే వెన్నుముఖ అన్నారు. ఆదే రీతిలో కలిసికట్టుగా పని చేయాలన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 1 : రాన్ను సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్‌కు బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పాలకొల్లు ఎమ్మెల్యే టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు విజయానికి కృషి చేయాలని కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు అన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అధ్యక్షతన సోమవారం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశానికి గంగరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సీనియర్ నాయకులు కొల్లి నరసింహమూర్తి, రావూరి సుధ, ఉన్నమట్ల కపర్ధి, కొల్లి కొండ ప్రసాద్ పాల్గొన్నారు.

రంగుల పిచ్చి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

భీమవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రంగుల పిచ్చి పట్టుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామంటూ భీమవరం జనసేన-తెలుగుదేశం-బీజేపీ కూటమి అభ్యర్థి పులపర్తి అంజిబాబు పిలుపునిచ్చారు. భీమవరం 35వ వార్డులో మూడు పార్టీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. జగన్ అసమర్ధ, అవినీతి పాలనతో అభివృద్ధి నిలిచిపోయిందని అంజిబాబు తెలిపారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధి జరగాలంటే కూటమితో సాధ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు సమర్ధ నాయకత్వాన్ని, పవన్ కల్యాణ్ నిజాయితీని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. జనసేన అధ్యక్షుడు కొటికలపూడి చిన్నబాబు, బీజేపీ రాష్ట్ర నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి యువతను మోసం చేశారని మండి పడ్డారు. ఉపాధి కల్పించలేకపోయారని తూర్పారబట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, చెన్నమల చంద్రశేఖర్, జనసేన రాష్ట్ర నేత వేగేశ్న కనకరాజు సూరి, జడ్పీటీసీ గుండా జయప్రకాష్, మల్లినీడి బాబి, బండి రమేష్ కుమార్, వానపల్లి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

'మాదిగల ద్రోహి జగన్'

పెనుమంట్ర, ఏప్రిల్ 1: ఎస్సీ వర్గీకరణ అడ్డుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మాదిగల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు తొత్తలమూడి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం మార్టేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో వాదనలు జరుగు తుంటే కనీసం జగన్ రెడ్డి లాయర్లను కూడా పెట్టకుండా అన్యాయం చేశారని అన్నారు ఎన్డీఏ కూటమికి మద్దతు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు పైడియ్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 27 ఎస్సీ సంక్షేమ పథకాల ను రద్దు చేశా రని అన్నారు.

పొత్తు ధర్మాన్ని పాటిద్దాం: జనసైనికులు

ఆచంట, ఏప్రిల్ 1: పొత్తు ధర్మాన్ని అందరూ పాటించి ఆచంట నుంచి టీడీపీ తరుపున ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రైతు సంఘం భవనంలో నియోజకవర్గ జనసేన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జనసైనికులు మాట్లాడుతూ పొత్తు గెలవాలి.. జగన్ పోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ జనసేన పార్టీకి తాను అన్ని విధాలా అండగా ఉంటానని మూడు పార్టీలు కలిసి ముందుకెళ్ళి విజయడంకా మోగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జె. బాలాజీ, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు, కొండవీటి శ్రీనివాస్, రావి హరీష్, తోపాటు టీడీపీ నాయకులు ఉప్పలపాటి సురేష్‌బాబు, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసంహమూర్తి, కేతా మీరయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కాళ్ళ, మార్చి 1 : బొండాడ గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, బీసీ సెల్ జిల్లా కన్వీనర్ కట్టా వెంకట్రావు తన అనుచరులు మేకా శాంతివర్ధన్, కాసాని వెంకటేశ్వరరావు, కట్టా సాయినాథ్ తదితరులతో కలిసి ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. ఈసందర్భంగా టీడీపీ విధానాలకు ఆకర్షితులై పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి పార్టీలో చేరామన్నారు.

కోమటితిప్పలో నాయకర్ ప్రచారం

మొగల్తూరు, ఏప్రిల్ 1: కోమటితిప్ప పంచాయతీలో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన అభ్యర్థిని గెలిపించాల్సిన అవశ్యకతను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో జనసేన మండల అధ్యక్షుడు గోపి, మాజీ ఎంపీపీ సత్తినేని మోహనరావు, వలవల నాని, గుబ్బల నాగరాజు, గట్టెం శ్రీను, సర్పంచ్ పులపర్తి ఏసులు, మేడిద ప్రభాకర్, లక్కు బాబి, జక్కం శ్రీమన్నారాయణ, తిరుమాని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని రుస్తుంబాదా పంచాయతీకి చెందిన సుమారు 100 మంది జనసేన కండువాలు కప్పుకున్నారు. యడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో వీరంతా వైసీపీకి రాజీనామా చేసిన బొమ్మిడి నాయకర్, కలవకొలను తాతాజీ సమక్షంలో జనసేనలో చేరారు. ఈకార్యక్రమంలో బందెల రవీంద్ర, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీపై వైసీపీ అసత్య ప్రచారం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 1: పింఛన్ పంపిణీలో వైసీపీ ప్రభుత్వం టీడీపీపై అసత్య ప్రచారం చేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పింఛన్లు సచివాలయ సిబ్బందితో ఇంటింటికి పంపిణీ చేయించాలని ఎన్నికల అధికారి దృష్టికి చంద్రబాబు తీసుకువెళ్ళారన్నారు. రూ. 200 లు ఉండే పింఛన్‌ను టీడీపీ రూ. 2000 వేలకు పెంచిందని, అధికారంలోకి రాగానే రూ. 4 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, రాంలక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు, షేక్ బాజి, సురగాల రాంబాబు, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

అరాచక పాలనతో విసిగిన ప్రజలు: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 1: వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగి పోయారని, ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని తాడేపల్లిగూడెం నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు ఉంగరాల శ్రీనివాసరావు సోమవారం బొలిశెట్టి, తోట గోపి సమక్షంలో జనసేనలో చేరారు. బొలిశెట్టి కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బొలిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసమే కూటమి ఏర్పడిందన్నారు. జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.









జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి సమక్షంలో పార్టీలో చేరిన ఉంగరాల శ్రీనివాసరావు... భీమవరంలో జనసేన నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు, చిన్నబాబు..వైసీపీ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ వెంకట్రావును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామరాజు.. కోమటితిప్పలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనసేన అభ్యర్థి నాయకర్

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు



పాలకోడేరు, ఏప్రిల్ 1 : ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాళం శ్రీనివాసరావు అన్నారు. కుముదవల్లి, గొల్లలకోడేరు గ్రామాలలో ఎన్నికలు జరగాల్సిన తీరు, పోలీసుల భద్రతా చర్యలుపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. ఆర్ఐ నాగభూషణరావు, వీఆర్వోలు ఇందిర, అప్పారావు, సిబ్బంది, పాల్గొన్నారు.

గ్రామాల్లో శివ ఎన్నికల ప్రచారం



కాళ్ళ, మార్చి 1 : బొండాడపేట, బొండాడ, ఎల్ఎన్ పురం, ఆనంద పురం, మాలవాని తిప్ప, ఎస్సీ బోస్ కాలనీ గ్రామాల్లో ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివ రామరాజు (కలవపూడి శివ) సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతివీధికి ఆటోలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆక్వా రైతుల్లో వెలుగులు నింపానని ప్రజలకు, రైతులకు గుర్తు చేశారు. ఈసందర్భంగా ప్రచారం కోసం గ్రామాలకు వెళ్ళిన శివరామరాజుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ ప్రచారంలో కలవపూడి సర్పంచ్ గేదల జాన్, మాజీ సర్పంచ్ గుడ్ల మోహనరావు, దాసరి రాజు, రెడ్డిపల్లి జనార్దన్, వేగేశ్న బాలగణపతి వర్మ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు పండుగలే పట్టుకొమ్మలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 1 : భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పండుగలే పట్టు కొమ్మలని సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, తెలుగుభాష, ఉగాది ఔన్నత్యంపై సదస్సులు, విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 9న జరిగే ఉగాది వేడుకల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలి

భీమవరం ఏప్రిల్ 1 : ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ పేర్కొన్నారు సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఓటు హక్కు వినియోగం పై ఓటర్లకు అవగాహన నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు విని యోగించుకోవడం మన బాధ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురు కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కళాజాత బృందం ద్వారా ఓటు హక్కు పై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి. ఎంపీడీవో వెంకట్రామన్, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామరాజుపై కేసు

ఆకివీడు, ఏప్రిల్ 1: ఎమ్మెల్యే రామరాజు, ఆముదాలవలస మాజీ ఎమ్మెల్యే రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, మరికొందరిపై ఎంపీడీవో ఫిర్యాదు మేరకు ఎంసీసీ వైలేషన్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. కలింగూడెంలో జయహో బీసీ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. సమయం దాటినా సమావేశం నిర్వహించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

పెంటపాడు, ఏప్రిల్ 1: విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని ఎంఈవో టీవీ రామకృష్ణ అన్నారు. దర్శిపర్రు ప్రాథమిక పాఠశాల-2 విద్యార్థిని యోగిత నవోదయకు అర్హత సాధించడంతో సోమవారం ఆయన అభినందించారు. హెచ్‌ఎంలు రమణ, ప్రసన్న, విశ్రాంత హెచ్‌ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఉండి, ఏప్రిల్ 1 :ఆక్వా పంటకు గిట్టుబాటు ధరలేని కారణంగా చెరువులన్నీ ఖాళీ అయ్యాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉండిలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం దండు రామలింగరాజు అధ్యక్షతన జరిగింది. హరేరామ్ మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించి ఆక్వాపంటకు 100 కౌంట్‌కు కనీసం రూ.300 ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆక్వాపంట గిట్టుబాటు లేని కారణంగా ఆక్వా చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయన్నారు. మేత, మందుల ధరలు పెరగడం వలన ఉత్పత్తి ఖర్చు పెరుగుతుందన్నారు. కరంటు, డీజిల్ ధరలు పెరగడంవలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పటిష్ఠం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పటిష్ఠం చేసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పేర్కొన్నారు. మాధవరంలో నిర్మాణ కార్మికుల సమావేశం గ్రామ సంఘ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కామన ఎంపిక



తణుకు, ఏప్రిల్ 1: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా తణుకు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది కామన మునిస్వామి ఎన్నికయ్యారు. సోమవారం ఏలూరులో ఐలు రాష్ట్ర కమిటీ సమావేశంలో తనను ఎన్నుకున్నట్టు మునిస్వామి చెప్పారు.

ట్రిపుల్-ఎఫ్ కార్మికుల జీతాలు పెంచాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 1: ఫుడ్ ఫ్యాట్స్ ఫెర్టిలైజర్స్ (ట్రిపుల్-ఎఫ్) కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల జీతాలు పెంచి అయిదేళ్లు దాటిపోయిందని, నిత్యావసర సరుకులు పెరిగి వారి జీవనం దుర్భరమైందని, యాజమాన్యం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఫ్యాక్టరీ కార్మిక సంఘ నాయకులు టి. గణేశ్వరరావు, పెనుమాక శ్రీను, ఎం. శ్రీను, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.